## (ఖండవల్లిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 11-3-96)

ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,

భగవద్గీతలో భగవంతుడు నాలుగు యోగాలను గురించి చెప్పాడు. ఆ నాలుగు యోగాల లక్ష్యం మనస్సును బాగుచేయటానికే. అది మనం మర్చిపోతున్నాము. అవి వేరువేరుగా ఉన్నాయి అని కంగారు పడకండి. ఆ నాలుగు యోగములు మనస్సును సంస్కరింపజేసుకోవటానికే. యోగం వస్తువును మనకు పట్టి ఇవ్వనక్కరలేదు. మన హృదయంలో వస్తువు సదా సిద్ధంగా ఉంది. కొత్తగా సంపాదించేది ఏమీకాదు. అది పూర్వజన్మలోనూ, ఈ జన్మలోనూ మన స్వరూపంగానే ఉంది. రాబోయే జన్మలో కూడా మన స్వరూపంగానే ఉంటుంది. ప్రతీ జన్మలోనూ మన స్వరూపంగానే ఉన్నప్పటికి అది మనకు తెలియటంలేదు. దానికి సంబంధించిన అవగాహన మన మెదడుకు లేదు కాబట్టి అది తెలియబడటంలేదు. అది మన స్వరూపంగానే ఉంది. మన శరీరం కంటే దగ్గరగా ఉంది కాని మనకు తెలియకపోవటంవలన అది దూరంగా ఉందని మనకు అనిపిస్తోంది. భగవంతుడు మన స్వరూపంగానే ఉన్నాడు అన్న సంగతి మనకు తెలియకపోవటం చేత కైలాసమునకు ఎప్పుడు వెళదాము, వైకుంఠమునకు ఎప్పుడు వెళదాము అనిపిస్తూ ఉంటుంది. తెలిస్తే మనకు ఏకోరిక రాదు. కోరిక ఉదయించదు. అన్ని యోగముల లక్ష్యం మన ఇంద్రియాలను మనస్సును అదుపు చేసుకోవటం అన్న సంగతి మనకు తెలియటంలేదు.

జపము, ధ్యానము సాగటంలేదు అని చెపుతూ ఉంటారు. మన మనస్సులో హెచ్చు తగ్గులు ఉన్నప్పుడు మీరు ధ్యానం చేద్దామన్నా ధ్యానంలో మనస్సు నిలబడదు. ఇంద్రియాలను, మనస్సును నియమించుకొన్న తరువాత ధ్యానం బాగా సాగుతుంది. ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం లేకుండా ధ్యానం చేద్దామన్నా సరిగా కుదరదు. మధ్యలో బ్రేకులు వచ్చేస్తాయి. పూర్వజన్మల వాసనలు అతి బలీయంగా ఉంటాయి. అవి మనస్సును బాహ్యముఖం చేస్తాయి. మనస్సును అదుపు చేయటానికి యోగం అవసరము. యోగం కంగారు పడితే వచ్చేయదు. నెమ్మదిగా ప్లాను చేసుకొని ఒక నిశ్చయానికి వచ్చి, ఆ నిశ్చయంలో వేవరింగ్ లేకుండా చూసుకొంటూ నెమ్మదిగా చేసుకొంటూ వస్తే నీ మనస్సు స్వాధీనంలోనికి వస్తుంది. తొందరపాటు, చాపల్యం పనికిరాదు. అవ్యభిచారభక్తి మంచిది. అవ్యభిచార భక్తి అంటే చపలత్వం లేని భక్తి. రమణమహర్షికి అరుణాచలం మీద ఉన్న భక్తి అవ్యభిచారభక్తి. గాలిలేనిచోట దీపం ఎంత నిశ్చలంగా ఉంటుందో అవ్యభిచార భక్తి అంత నిశ్చలంగా ఉంటుంది. లౌకికుల మాటలు పుచ్చుకొని చాపల్యం అక్కడ కలుగదు. అవ్యభిచార భక్తులతో సహవాసం చేస్తే మనకు ఉన్న వ్యభిచార భక్తి పోతుంది. వారి సహవాసం దొరకటం కష్టం. మనం డబ్బు సంపాదించుకోవటానికి ఎలా ప్రయత్నం చేస్తున్నామో ఆలాగ అవ్యభిచార భక్తులతోటి సహవాసం కోసం మనం ప్రయత్నం చేయాలి అని రామకృష్ణుడు చెప్పాడు.

హృదయం ఎంత పవిత్రమైనదో నీ మనస్సు అంత పవిత్రం అయితే గాని అది హృదయంలో నిలబడలేదు. ఏకాగ్రత, పవిత్రత చాలా ముఖ్యం. ఏకులంలో ఉన్నా, ఏమతంలో ఉన్నా, ఏగురువును ఆశ్రయించినా, ఏ మార్గములో ప్రయాణం చేస్తున్నా ఈ పవిత్రత, ఏకాగ్రతల వలన హృదయం యొక్క లోతులలోనికి ప్రవేశించగలరు. మన హృదయంలో ఉన్న పరమేశ్వరుడు ఎంత పరిశుద్ధంగా ఉన్నాడో, ఎంత పరిపూర్ణంగా ఉన్నాడో, ఎంత నిర్మలంగా ఉన్నాడో మనం పూజచేసి, జపంచేసి, ధ్యానంచేసి మన మనస్సుకు అంత నిర్మలత్వం పట్టిస్తే అప్పుడు ఈ మనస్సు హృదయంలో ఐక్యం అవుతుంది. నీ హృదయంలో ఎంత అందం ఉందో నీ మనస్సుకు అంత సౌందర్యం వస్తే అప్పుడు ఈ రెండు అందాలు ఐక్యమవుతాయి.

భక్తిమార్గములో ప్రయాణం చేస్తావో, జ్ఞాన మార్గములో ప్రయాణం చేస్తావో ప్రయాణం చెయ్యి. నీపూర్వజన్మ సంస్కారమును బట్టి, నీ ప్రవృత్తిని బట్టి నీకు ఏమార్గము తేలికగా ఉందో, Safeగా ఉందో ఆ మార్గములో ప్రయాణం చెయ్యి. భక్తి మార్గము, జ్ఞానమార్గము బయటకి వేరుగా కనిపిస్తున్నాయి కాని అన్నీ ఒక్కటే. మార్గములు వేరైనా గమ్యం ఒక్కటే. ముందు నీవు గమ్యమును నిర్ధారణ చేసుకో. తరువాత ప్రయాణం చేయటానికి ప్రయత్నం చెయ్యి. చాపల్యం వద్దు. ప్రయాణం ప్రారంభించిన తరువాత వెనుకకు చూడవద్దు. వెనుకకు చూస్తే గమ్యమును చేరలేవు. ఒక నిర్ణయానికి వచ్చి ప్రయాణం ప్రారంభించిన తరువాత నీకు అత్యంత సన్నిహితుల పిలుపు వినిపించినా వెనుకకు రావద్దు, వస్తే నీవు పతనమవుతావు. శరణాగతి మార్గము ఏ గమ్యానికి తీసుకొని వెళుతుందో విచారణ మార్గము కుడా ఆ గమ్యానికే తీసుకొని వెళుతుంది. భక్తిమార్గము ఏగమ్యానికి తీసుకొని వెళుతుందో జ్ఞానమార్గము ఆ గమ్యానికే తీసుకొని వెళుతుంది. ఉన్నది ఒక్కటే వస్తువు. ప్రకృతిని దాటిన తరువాత ఎవరైనా ఒక్కటే.

నీ హృదయంలో ఉన్న నిజాన్ని మాయ కప్పిఉంచుతోంది. ఆ మాయను తీసివేయటమే సాధన యొక్క ప్రయోజనం. తెర ఉన్నప్పుడు పెళ్ళికూతురు కనబడదు. తెరతీసివేసి నపుడు కనిపిస్తుంది. అలాగే నీ హృదయంలో పరమాత్మ ఉన్నా మాయ అనేది తెరక్రింద ఉంది. నీ సాధన యొక్క లక్ష్యం ఏమిటి అంటే ఆ తెరను ప్రక్కకు తొలగిస్తే నీ లోపల ఉన్న పరమాత్మ తనంతట తానుగా వ్యక్తమవుతాడు. వాడు స్వయం ప్రకాశి. వాడు ఉండటం వలననే తెలియబడతాడు. అన్ని కాలములలోనూ ఉంటాడు. వాడికి హద్దులు లేవు, పరిమితులు లేవు. శరణాగతి గురించి కృష్ణుడు ఏమి చెపుతున్నాడు అంటే నీవు పాక్షికంగా శరణాగతి అవ్వటానికి ప్రయత్నం చెయ్యి తరువాత పూర్ణ శరణాగతి వస్తుంది. పూర్ణ శరణాగతి ఒకేసారి రావాలి అనుకోకు. కంగారు పడవద్దు. నెమ్మదిగా వెళ్ళు నీకు పూర్తి శరణాగతి రాగానే ఏదైతే నేను, నేను అంటున్నావో ఆ నేను కాలి బూడిద అవుతుంది. మేఘం సూర్యుడిని కప్పివేసింది అనుకోండి సూర్యుడు కనబడడు. అదే విధంగా ఇప్పుడు నీవు ఏదైతే నేను, నేను అంటున్నావో ఆ నేను అనేది మేఘం. ఈ మేఘం నీలోపల ఉన్న ఆత్మసూర్యుడిని కనిపించకుండా చేస్తోంది. సూర్యుడి కంటే మేఘం గొప్పది కాదు. కాని సూర్యుడు కనబడకుండా మేఘం చేయగలదు. అదే విధంగా నీలోపల ఉన్న నిజమైననేను కంటే అబద్ధమైననేను ఏమీ గొప్పదికాదు. కాని నిజమైననేను కనబడకుండా అబద్ధమైననేను చేయగలదు. నిజమైననేనుకు శరణాగతి చెందితే అబద్ధమైననేనుకు food supply ఆగిపోతుంది. అప్పుడు అది కృశించి రాలిపోతుంది.

శివభక్తులు కైలాసానికి, విష్ణుభక్తులు వైకుంఠానికి వెళ్ళిపోతాము అనుకొంటారు. నిజం తెలియనపుడు ఈ ప్రయాణాలు ఉంటాయి. Subject సరిగా అర్థమయితే కైలాసానికి వెళ్ళాలి అనే సంకల్పము కూడా రాదు. వైకుంఠములో నారాయణుడు ఉన్నాడా అంటే ఉన్నాడు అని భగవాన్ చెప్పారు. ఎలా ఉంటాడు అని అడిగారు. ఇక్కడ ఉంది భగవాన్ టీచింగ్‌లో ఉన్న ఔన్నత్యం. ఎక్కడా ఉపనిషత్తులలో, వేదాలలోలేని అందాలు. నీవు శరీరంలోపల ఎలా ఉంటున్నావో వైకుంఠములో నారాయణుడు అలా ఉంటాడు అన్నారు భగవాన్. ఈ శరీరంలో ఉన్న నేను ఎంత నిజమో వైకుంఠములో ఉన్న నారాయణుడు, కైలాసంలో ఉన్న శివుడు అంతే నిజంగాని అది పారమార్థిక సత్యంకాదు.

పరాయిబుద్ధి ఉన్నావారికి Subject అర్థంకాదు. సొంతబుద్ధి ఉన్నవారికి అర్థమవుతుంది. కొంతమందికి సొంతబుద్ధి ఉండదు. పుట్టింది మొదలు చనిపోయేవరకు పరాయిబుద్ధితో బ్రతుకుతారు. ఎవరు ఏది చెపితే అటు గంతులేస్తారు. శరణాగతి ఎప్పుడైతే పొందుతున్నావో అప్పుడు మిధ్యానేను నశిస్తూ ఉంటుంది. పూర్ణశరణాగతి పొందితే మిధ్యానేను తల్లక్రిందులుగా పడిపోతుంది. ఈ మిధ్యానేను ఎప్పుడైతే పడిపోయిందో

దానిని అంటిపెట్టుకొని ఉన్న సంస్కారములు, కుయుక్తులు, కుతంత్రాలు అన్నీ కూడా పడిపోతాయి. మిథ్యానేను పడిపోయినపుడు దానిని అంటిపెట్టుకొని ఉన్నవి తుడిచి పెట్టుకొని పోతాయి. అప్పుడు నీకు స్వేచ్ఛ కలుగుతుంది. సర్వస్వతంత్రుడవు అవుతావు. మిథ్యానేను దానికూడా ఉన్న పరివారము ఎప్పుడైతే పడిపోయిందో అప్పుడు సుఖపడతావు. ఇప్పుడు నీవు స్వతంత్రముగా ఉన్నట్లు నటించవచ్చుగాని స్వతంత్రుడిగా ఉండలేవు. ఎందుచేతనంటే నిజమైన నేను స్వతంత్రముగా ఉండగలదు గాని మిథ్యానేను స్వతంత్రముగా ఉండలేదు.

దేహం ఎవరిది? దేహమునీదే. దేహము నీదికాదు అని చెప్పటం లేదు. నీవు మాత్రం దేహముకాదు అని భగవాన్ చెపుతున్నారు. ఇక్కడ ఉన్న క్లూను అర్థం చేసుకోండి. దేహమే మీరు అనుకోండి గాఢనిద్రలో దానిలో నుండి విడిపోలేవు. నీలోపల ఉన్న బలహీనతలు నీకు తెలియవు. వాటిని నీ brain లోనికి తీసుకొని వచ్చి ఈ బలహీనత నీకు ఉంది అని చూపిస్తాడు. దీనిని నీవు తొలగించుకోవాలి అని చెపుతాడు. ఈ వాసనలు అన్నీ తొలగించుకోవటం నా వలన ఏమవుతుంది అని నీవు అంటావు. అప్పుడు లోపల ఉండి నీకు బలాన్ని ఇస్తాడు. వాసనలను తొలగించుకోవటానికి తగినశక్తి లోపల నుండి ఇస్తాడు. ఆయన లోపలే ఉన్నాడు కదా ఇది అంతా ఆయనే చేస్తాడు. నీకు ఉన్న బలహీనతలను ముందు చూపిస్తాడు. ఇవి అన్నీ ఏదేహబుద్ధి మీద అయితే ఆధారపడి ఉన్నాయో చివరలో దానిని cut చేస్తాడు. మరుక్షణంలో నీకు realization కలుగుతుంది. ఇది అంతా గురువే చేస్తాడు. మనం చేస్తున్నాము అనుకొంటాము. లోపల కెలికేవాడు ఆయనే. surgery చేసేవాడు ఆయనే. గురువు చేసే సహాయం మనకు కనబడదు. ఫ్యాన్ స్పీడుగా తిరుగుతూ ఉంటే దాని రెక్కలు మనకు కనబడవు. మనకు కనబడటం లేదు అని రెక్కలు లేవు అనుకొంటామా. అలాగే గురువు చేసే సహాయం అంత స్పీడుగా చేస్తాడు. అందువలన అది మన కళ్ళకు కనబడటం లేదు. నీ బుద్ధికి అది అందదు. నిజమైన గురువు తను చేసే సహాయం నీకు తెలియాలి అని ఆయన అనుకోడు. ఎందుచేత నంటే వ్యక్తిగతమైన నేను అక్కడలేదు.

మీరు ఏదో చెప్పుకొనిపోతున్నారు. ఏదీ లేదు అంటున్నారు. మీ బోధకు ముందే మేము పూజలు, యజ్ఞాలు, యాగాలు అన్నీ చేసాము. ఫలితం అనుభవించటానికి రెడీగా ఉన్నాము. తీరా పనులు చేసేశాము, ఫలితం రెడీగా ఉంది. మీ బోధ చూస్తే మానోటి దగ్గరకు వచ్చింది రాలగొట్టేస్తున్నారు. మా ఆధారాలు అన్నీ క్రింద నుండి లాగేస్తున్నారు. కర్మఫలితం వస్తుంది. అది వ్యవహారిక సత్యము, పారమార్థిక సత్యంకాదు. ఫలం వస్తుంది. నీ కరెక్టు ఎడ్రసు ఈశ్వరుడికి తెలుసు. నీ పుణ్యఫలం నీకే ఇచ్చేస్తాడు. కంగారు పడనక్కరలేదు. నేను అనే బుద్ధితో చేసావు కాబట్టి దానికి ఫలితం వచ్చేస్తుంది. నీవు enjoy చేయవచ్చు. కాని అది నగ్న సత్యం కాదు. కర్మ సిద్ధాంతము ప్రకారము వైకుంఠానికి వెళతావు. కాని ఎవడైతే ఫలితమును అనుభవించాలి అనుకొంటున్నాడో వాడిని బోను ఎక్కించు, విచారణ చెయ్యి. విచారణ చేస్తే వాడు ఎవడోవాడికి తెలియబడుతుంది. వాడిమూలం వాడికి తెలిసినపుడు ఉన్న సత్యం ఏదో వాడికి ఎరుకపడుతుంది. వాడి మూలం వాడికి ఎప్పుడైతే తెలిసిందో, వాడి స్వరూపం వాడికి ఎప్పుడైతే తెలిసిందో వైకుంఠమునకుగాని, కైలాసమునకుగాని వెళ్ళేవాడు కనబడడు. వాడు సత్యంలో ఐక్యమవుతాడు.

పునర్జన్మ వస్తుంది అని నేను అనుకొంటున్నాను. నేను చేసిన పుణ్యాన్ని బట్టి మంచి birth వస్తుంది అనుకొంటున్నాను. కాని మీరు చెప్పిన subject విన్న తరువాత పునర్జన్మలో నుండి తప్పించుకోవాలి అని నాకు అనిపిస్తోంది. ఇక జన్మ రాకూడదు అని కోరుకొంటున్నాను. ఏదో జనన మరణ ప్రవాహములో కొట్టుకొని పోతున్నాను. ఈ ప్రవాహములో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేద్దామని అనుకొంటున్నాను.

ఇందులో నుండి నేను బయట పడగలనా అని భగవాన్‌ను అడుగుతున్నాడు. పునర్జన్మలో నుండి బయటకు రావటానికి ఉపాయం చెప్పండి అని అడుగుతున్నాడు. ఇప్పుడు ఎవడైతే పుట్టాడో వాడే తిరిగి పుడతాడు కదా. ఆ పుట్టినవాడు ఎవడు? కష్టాలు పడుతున్నవాడు ఎవడు? శరీరం బాధ పడటంలేదు శరీరంలో ఉండి ఆ బాధలు పడేవాడు ఎవడు? నాకు పునర్జన్మ రాకుండా చెయ్యాలి అని అంటున్నాను. రాత్రినిద్ర పోతావుకదా. ఆ నిద్రలో నాకు పునర్జన్మ రాకుండా చూడండి అనేవాడు ఉన్నాడా. గాఢనిద్రలో ఏ గొడవలేదు. మెలుకువ వచ్చాక ఈ గొడవ అంతా వస్తోంది. ఈ జన్మల గొడవలు, పుణ్యం, పాపం ఇవి అన్నీ కూడా మనస్సులో ఉన్నాయి. గాఢ నిద్రలో మనస్సులేదు. అందువలన గాఢనిద్రలో ఈ జన్మలగొడవలేదు. దేవుడి గొడవలేదు. అడ్డంకొట్టి మిమ్మల్ని సడన్‌గా మలుపు త్రిప్పి హృదయం యొక్క లోతులలోనికి, ఏక్కడైతే ఈశ్వరుడు ఉన్నాడో అక్కడికి తీసుకొని వెళుతున్నాడు. గాఢనిద్రలో మనస్సు లేనప్పుడు కూడా నీవు ఉన్నావు. కాని అక్కడ జన్మల గొడవగాని, మనస్సు గొడవగాని, దేవుని గొడవగాని లేదు. రాబోయే జన్మల గురించి ఆలోచించేవాడు అక్కడలేదు. ఎవడైతే గాఢనిద్రలో ఉన్నాడో వాడు మెలుకువలోకూడా ఉన్నాడు. మెలుకువలో వాడు నీకు కనబడకుండా నీ మనస్సు చేస్తోంది. ఆ మనస్సును చంపివేయటమే నీ సాధనలయొక్క లక్ష్యం. ఎప్పుడైతే నీ మనస్సును చంపేశావో మరుక్షణంలో నీలోపల ఉన్న నిజం తానుగా నీకు వ్యక్తమవుతుంది. ఇప్పుడే ఇక్కడే నిజం నీకు వ్యక్తమవుతుంది.

రాబోయే జన్మలగొడవ వదిలెయ్యి. నీవు మంచి జన్మను కోరుకొంటున్నావు అంటే ఒక గోతిలోనుండి ఇంకో గోతిలో పడటంలాంటిది. ఈజన్మ ఎంత అసత్యమో రాబోయే జన్మకూడా అంతే అసత్యము. నేను చెప్పేమాటలు అసత్యం అనుకోకండి. ఇక్కడ మనం కూర్చొని మాట్లాడుకోవటం అసత్యంకాని నేను చెప్పే మాటలు అసత్యం కాదు. ఒకవేళ మంచి జన్మ వచ్చింది అనుకో. అక్కడ ఒక శరీరము ఉంటుంది. అది ఎంతకాలం ఉంటుంది. కొంతకాలం తిరుగుతుంది. తరువాత మరణిస్తుంది. మిధ్యానేను ఎక్కడయితే ఉదయించి వస్తోందో దాని పరిష్కారం కూడా అక్కడే ఉంది. నేను అనే తలంపు ఎక్కడయితే ఉదయించి వస్తోందో ఆ sourceను నీవు చూడగలిగితే అది అక్కడే అణిగిపోతుంది. అక్కడే కాలి బూడిద అవుతుంది. నీవు మెలుకువలో నీ మూలాన్ని తెలుసుకోగలిగితే పునర్జన్మలు లేవని నీకు తెలుస్తుంది, పునర్జన్మలు అన్నీ కలక్రింద కరిగిపోతాయి, జన్మలు అన్నీ స్వప్న సమానము అని తెలుస్తుంది.

నీలోపల ఉన్న సత్యవస్తువును తెలుసుకొన్న తరువాత అంతా ఆనందమే. దేవుడిలో ఆనందము ఉంది అనటంలేదు. అంతటా ఉన్నది ఆనందమే అంటున్నారు. దేవుడే ఆనందము అనుకోకు. నీకు realization వచ్చినపుడు ప్రపంచాన్నికూడా ఆనందముగానే అనుభవిస్తావు. All is bliss అనుకో అప్పుడు పునర్జన్మ రాకుండా ఎలా తప్పించుకోవాలి అనేవాడు కాలి బూడిద అవుతాడు. అప్పుడు పునర్జన్మ గొడవ ఉండదు. All is bliss అనుకొనేవాడికి ప్రారబ్దంలేదు, ఆగామి లేదు, సంచితం లేదు. ప్రారబ్దం, ఆగామి, సంచితం ఎవడికి? కర్తృత్వం ఉన్నవాడికి. కర్తృత్వం ఎప్పుడైతే నశించిందో ఆగామి, సంచితం, ప్రారబ్దం లేదు. జ్ఞానంకలిగినవాడికి ప్రారబ్దము, ఆగామి, సంచితం మూడూ కూడా నశిస్తాయి అని భగవాన్ చెప్పారు. ప్రారబ్దం నశించదు అని అడిగేవాడి ఉద్దేశ్యం. ప్రారబ్దం నశిస్తుంది అని చెపుతున్నారు. మీకు కురుపు వేసింది, బాధపడుతున్నారుకదా మరి దానిమాట ఏమిటి అన్నాడు. భగవాన్‌కు కురుపువేసింది, బాధపడుతున్నారు అని చూసేవారికి అనిపిస్తోంది కాని బాధపడేవాడు ఇక్కడలేడు అన్నారు భగవాన్. చూసేవాడికి ప్రారబ్దం అనుభవిస్తున్నట్లు కనిపిస్తుంది కాని ప్రారబ్దం అనుభవించేవాడు అక్కడలేడు. అందువలన జ్ఞానికి ప్రారబ్దం కూడా లేదు.

దేహప్రారబ్ధమునుబట్టి మంచి, చెడ్డా వస్తూ ఉంటాయి. గమ్యమునుమాత్రం విడిచిపెట్టవద్దు. మీరు సాధనచేసేటప్పుడు గమ్యమును దృష్టిలో పెట్టుకొంటే మీకు వచ్చిన కష్టం కష్టంలాగ అనిపించదు. కొంతమంది దేహాలు అదృశ్యం చేసుకొన్నారు దానిమాట ఏమిటి అని అడుగుతున్నారు. ఇవి అన్నీ భౌతికమైన విషయములు. నీదేహం ఎంత సత్యమో ఇవికూడా అంతే సత్యము. నీదేహం స్మశానమునకు వెళ్ళిందా, అదృశ్యం అయిందా అన్నది ముఖ్యంకాదు, నీవు మోక్షస్థితిని పొందావా, లేదా అనేది ముఖ్యం. నువ్వుకాని దాని గొడవనీకు ఎందుకు? నీవు దేహము కాదు. దానిగొడవ నీకు ఎందుకు? జీవితం పొడుగునా సాధనచేసి నీ శరీరమును మాయచేసుకోవటమా. అదే నీ గమ్యమా నీ శరీరం అదృశ్యం అవ్వదు అనుకో, నీ శరీరం మరణిస్తుంది. దానిని కాలుస్తారు అనుకో నీకు వచ్చే నష్టం ఏమిటి? నీ శరీరం మాయం అయ్యిందా, లేదా అనేది నీ గమ్యంకాదు. నీ గమ్యం ఏమిటో స్పష్టపరచుకో. నువ్వు పొందవలసినదానిని చూసుకో. నీవు ఆత్మవు. శరీరం గొడవ నీకు ఎందుకు? నీవు కానిదాని గొడవ నీకు ఎందుకు? నీవు కాని విషయాలగురించి నిన్ను ఎవరు ఆలోచించమన్నారు. మామిడిపండు రసం అంతా క్రిందపడేసి తొక్కలు భుజాన వేసుకొని తిరుగుతావా. ఏదైతే essence దానిని వదిలేసి essence కానిదానిని పట్టుకొని తిరుగుతావా. నీవు పొందవలసిన వస్తువును పొందిన తరువాత ఈ దేహం గొడవ నీకు అక్కరలేదు. బ్రహ్మానుభవం పొందటానికి ఉపయోగపడని మాటలు ఎవరైనా చెప్పినా వాటిని తీసి ఒక ప్రక్కన పెట్టండి. బ్రహ్మానుభవం పొందటానికి ఉపయోగపడే మాటలు మాత్రమే తీసుకోండి.

భగవాన్‌దగ్గరకు ఒకరువచ్చి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకొన్నాను అని చెప్పారు. పిల్లలు పుట్టకుండా నీవు ఆపరేషన్ చేయించుకొన్నావు, బాగానే ఉంది, నువ్వు తిరిగి పుట్టకుండా ఆపరేషన్ చేయించుకో అన్నారు భగవాన్. ఆ సర్జరీ చేయించుకోండి. మిగిలిన గొడవలు వదిలివేయండి.

కొంతమంది మహాత్ముల శరీరాలు శవాలు అవ్వలేదు, అదృశ్యం అయ్యాయి. అలా శరీరాలను అదృశ్యం చేసుకొన్నవారందరికి జ్ఞానం వచ్చేస్తుంది అని నీవు పొరపాటు పడకు. భగవంతునిమీద విశ్వాసంవలన నీకు కొన్ని మహిమలు వస్తాయి. ఆ మహిమలతోటి నీ శరీరమును కనబడకుండా చేసుకొనే శక్తి మీకు రావచ్చును. అంతమాత్రంచేత మీకు మోక్షం వస్తుందని ఎక్కడా లేదు. అటువంటి పొరపాటు అభిప్రాయానికి రావద్దు. విషయాన్ని సరిగా అర్థంచేసుకొని ప్రాక్టీసులో పెట్టాలి. నీ గమ్యం ఏమిటి అని ముందు నీవు నిర్థారణకు రావాలి. దేహం అదృశ్యమయితే మోక్షం వస్తుంది, దేహం శవం అయితే మోక్షం రాదు అని నీవు అనుకోవద్దు. వీటికి మోక్షానికి ఎట్టి సంబందం లేదు. మోక్షం వీటి అన్నింటికి అతీతంగా ఉంది. ఎవరికైనా దేహం అదృశ్యమయినా అది దేహప్రారబ్ధమునుబట్టి అదృశ్యమవుతుంది. ఇందులో పెద్ద వింత ఉంది అనుకోవద్దు. నేను విభూతి తెప్పిస్తాను అనుకోండి. అది మీచేతిలో పెడతాను అనుకోండి దానివలన మీకు మోక్షం వచ్చేస్తుంది అని అనుకోవద్దు. ఈశ్వరుడిమీద విశ్వాసంవలన ఒకో దేహప్రారబ్ధానికి కొన్ని మహిమలు వస్తాయి. ఆ మహిమలు విభూతి, కుంకుమ నీకు తెచ్చి ఇవ్వవచ్చు. అంతమాత్రంచేత నీకు మోక్షం వచ్చేస్తుంది అని అనుకోవద్దు. అటువంటి పొరపాటు అభిప్రాయంపడవద్దు.